క్లుప్తంగా

రొంగలికి జన్మదిన శుభాకాంక్షలు


కేక్ కట్ చేస్తున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం

డెంకాడ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, డెంకాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలంనకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, అభిమానుల మధ్య కనక సింహాచలం కేక్ కట్ చేశారు.

సర్వజన ఆస్పత్రిలో పనిచేయని ఎక్స్‌రే


పనిచేయని ఎక్స్‌రే మిషన్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వారం రోజుల కిందట ఎక్స్‌రే మిషన్ పాడైంది. అధికారులు పట్టించుకోకపోవడంతో కొద్ది రోజులుగా రోగులకు ఇక్కట్లు తప్పలేదు. ప్రతిరోజూ ఎక్స్‌రే కోసం సుమారు 50 మంది వరకు వస్తుంటారు. వారంతా ప్రైవేట్ స్కాన్ సెంటర్లకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఇదే విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా ఒకటి, రెండు రోజుల్లో ఎక్స్‌రే మిషన్‌కు మరమ్మతులు చేయిస్తామన్నారు.

గుంతల పూడ్చివేత


గుంతలను పూడుస్తున్న కార్మికులు

విజయనగరం: నగరంలోని అయ్యన్నపేట ప్రాంతంలో ఏర్పడిన గుంతలను నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాలతో బుధవారం పూడ్చివేసినట్లు కార్పొరేషన్ డీఈ అప్పారావు బుధవారం తెలిపారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. దీంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈక్రమంల గుంతలు పూడ్చివేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు గ్రామసందర్శన

డెంకాడ: మండలంలోని నాతవలసలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అధికారులు గ్రామంలో పర్యటించి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, తదితర కార్యాలయాలను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తారని పేర్కొన్నారు.

లారీ బోల్తా..

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఓ లారీ బోల్తా పడింది. చర్చివీధి కాలనీ వైపు కల్వర్టుపై దూసుకెళ్లి బోల్తా పడినప్పటికీ.. డ్రైవర్, క్లీనర్‌లకు ఎటువంటి గాయాలు కాలేదు. ఈ విషయమై పెదమానాపురం ఎస్సై జయంతి వద్ద ప్రస్తావించగా ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

బొండపల్లి: మండలంలోని అంబటివలసలో ఆక్రమణలకు గురైన కొండ పోరంబోకు ప్రభుత్వ భూముల్లో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు బుధవారం బోర్డులు ఏర్పాటు చేయించారు. సర్వే నంబర్లు 69-2, 69-3, 69-4లో ఉన్న 5.48 ఎకరాల విస్తీర్ణం ప్రభుత్వ భూమి అని.. ఎవ్వరు ఆక్రమించినా, సాగు చేపట్టినా శిక్షార్హులని తెలియజేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.సతీష్, వీఆర్‌ఓ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయండి

గంట్యాడ: బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఆర్.అచ్యుతకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. కొర్లాం గ్రామంలోని విలేజ్ క్లినిక్‌లో బుధవారం నిర్వహించిన బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఇంతవరకు ఎంతమందికి వ్యాక్సిన్ వేశారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విలేజ్ క్లినిక్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని, విధుల్లో అలసత్వం వహించవద్దని చెప్పారు. హెచ్ఈఈఓ రత్న, ఎంపీహెచ్ఈఓ కె.ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడే ఎందుకలా...!

- నగరాన్ని తలపిస్తున్న భవనాలు
- కంపుకొడుతున్న వీధులు
- క్షీణించిన పారిశుధ్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


గుకంలాం - నందాం రహదారిలో వేసిన చెత్తాచెదారం


గుంకలాంలో ఆకట్టుకునే భవనాలు

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాం ప్రాంతం నగరాన్ని తలపిస్తోంది. కళ్లు చెదిరిపోయే భవనాలు.. ప్రతి వీధిలోనూ రోడ్లు.. ఇంతవరకు బాగానే ఉంది గాని పారిశుధ్యం మాత్రం అధ్వానంగా తయారైంది. ఏ వీధి చూసినా కంపుగొడుతోంది. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడబడితే అక్కడ చెత్తా,చెదారాలు పేరుకుపోతున్నాయి. కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు, విష కీటకాలకు నిలయంగా మారుతున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంకలాం నుంచి నందాం వెళ్లే దారిలో బహిరంగ మలవిసర్జన చేస్తుండడంతో ఆ దారి మీదుగా వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సిందే. గడిచిన కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో పాటు పెద్దవీధికి మలుపు తిరిగే ప్రాంతాన్ని కూడా బహిర్భూమికి వినియోగించడంతో అంటురోగాలు ప్రబలుతున్నాయి. ప్రధానంగా ఈ రెండు వీధుల్లో చెత్తను రోడ్డుపైనే పారవేయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. గ్రామ పరిసరాల్లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నా, పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

పనులు చేపట్టాలి...

గ్రామంలో ఏ వీధి చూసినా కంపుగొడుతోంది. పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఎక్కడబడితే అక్కడే చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో అంటురోగాలు ప్రబలుతున్నాయి. అధికారులు స్పందించాలి.

– బోగి అక్కునాయుడు, గుంకులాం..


శిథిలమైన సామూహిక మరుగుదొడ్లు

సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై పంచాయతీ విస్తరణాధికారి తిరుపతి నాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా.. పారిశుధ్య నిర్వహణపై సిబ్బందిని ఆదేశిస్తామన్నారు. అలాగే బహిరంగ మలవిసర్జన చేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

మరుభూమికి మార్గం కరువు..

- ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి
- చోద్యం చూస్తున్న పాలకులు


రైల్వేట్రాక్ గట్టు ఎక్కి శవాన్ని తీసుకువెళ్తున్న ద్వారపూడి వాసులు (ఫైల్)

విజయనగరం రూరల్: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు దత్తత గ్రామమైన ద్వారపూడిలో మరుభూమికి వెళ్లేందుకు మార్గం లేక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. చనిపోయిన వ్యక్తికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారు నుంచి శ్మశానానికి వెళ్లే మార్గం పూర్తిగా పాడైంది. అలాగే పిచ్చి మొక్కలు దట్టంగా మొలవడంతో కనీసం నడవడానికి వీల్లేకుండా పోయింది. దీంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని సుమారు రెండు కిలోమీటర్లు తిప్పి రైల్వే ట్రాక్ ఎక్కి శ్మశానికి చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా ఈ సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ద్వారపూడిని అన్ని విధాలా అభివృద్ధి చేశానని చెప్పుకుంటున్న కేంద్ర మాజీ మంత్రికి ఈ సమస్య కనిపించలేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ విస్తరణాధికారి తిరుపతినాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా.. శ్మశానానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గతంలో వేసిన రోడ్డు పాడైన మాట వాస్తవమేనన్నారు. మళ్లీ ఉపాధి నిధులతో రోడ్డు వేసేందుకు తీర్మానం చేశామని, త్వరలోనే పనులు చేపడతామని చెప్పారు.

ఇబ్బంది పడుతున్నాం..

శ్మశానానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. దీంతో మృతదేహాన్ని రెండు కిలోమీటర్లు తిప్పాల్సి వస్తోంది. అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలి.

గురాన సూరిబాబు, ద్వారపూడి

సమన్వయంతో పని చేయాలి

- ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీఓ హేమసుందర్


సోంపురం రైతుసేవా కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌టీఓ హేమసుందర్

వేపాడ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పనిచేస్తున్న రైతు సాధికార సంస్థ, సబల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ప్రకృతి వ్యవసాయం రీజనల్ సాంకేతిక అధికారి (ఆర్‌టీఓ) హేమసుందర్ సూచించారు. ఈమేరకు మండలంలోని సోంపురం రైతుసేవా కేంద్రం వద్ద సిబ్బందికి ప్రకృతి వ్యవసాయం సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంలో వేపాడ మండలాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సబల ప్రాజెక్ట్ ద్వారా రైతులకు అందిస్తున్న ప్రయోజనాలు, సహకారాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం అరిగిపాలెంలో 500 లీటర్ల జీల్లేడు ద్రావణం, సోంపురంలో దశపత్ర కషాయం రైతుల సమక్షంలో తయారు చేశారు. కార్యక్రమంలో ఎంటీఎల్ వసంత, సబల పీసీ శ్రావణి, సీఎస్‌పీ వెంకటరావు, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారపూడి గంగునాయుడు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. గంగునాయుడు బావ గొర్లె ఈశ్వరరావు గుండెపోటుతో ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాటూరు వెళ్లి మృతుడు ఈశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ సత్యవంతుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, జేసీఎస్ ఇన్‌చార్జ్ బోజంకి శ్రీను, సోంపురం ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ గళ్ల శ్రీరాములునాయుడు, నాయకులు దుల్ల మహేష్ తదితరులు ఉన్నారు.

• కలెక్టరేట్‌లో పారిశుధ్య లోపం..

విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పారిశుధ్య లోపం తాండవిస్తోంది. నిత్యం అధికారులతో సందడిగా ఉండే కార్యాలయం ప్రాంగణంలోనే చెత్తాచెదారాలు పేరుకుపోవడం, మురుగు నీరు నిల్వ ఉండడంపై కార్యాలయానికి వివిధ పనుల మీద వచ్చిన ప్రజలు పెదవి విరుస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



కలెక్టరేట్ ముఖద్వారం గోడలపై పిచ్చిమొక్కలు


డీఆర్వో కార్యాలయ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త


కార్యాలయ ముఖద్వారం ప్రాంతంలో నిల్వ ఉన్న నీరు




ముఖ్య విభాగాల కార్యాలయాల ప్రాంతంలో చెత్తా,చెదారాలు

అద్దె చెల్లించని దుకాణాలు సీజ్


దుకాణాలను సీజ్ చేయిస్తున్న అధికారులు

విజయనగరం: నగర పాలక సంస్థ అధీనంలో ఉన్న దుకాణాలకు సంబంధించి బకాయి అద్దెలను తక్షణమే చెల్లించాలని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య అన్నారు. దీర్ఘకాలంగా అద్దె బకాయిలు ఉన్న దుకాణాలను సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం నగరంలో పర్యటించి 42 దుకాణాలను సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది మూయించారు. దీంతో హుటాహుటిన కొంతమంది షాపుల నిర్వాహకులు అద్దె చెల్లించారు. నగదు రూపంలో రూ.7,24,348 రాగా డీడీలు, చెక్కుల రూపంలో 25,27,961 లక్షల రూపాయలు అందాయని సహాయ కమిషనర్ తిరుమలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... విజయవాడలోని వరద బాధితుల సహాయార్థపు పనుల్లో ఉన్న కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో యుద్ధ ప్రాతిపదికన అద్దె వసూలు చేయగా... ఒక్కరోజులోనే 32,52,309 రూపాయలు వచ్చిందన్నారు. మరో రెండు రోజుల్లో ఉన్న బకాయిలన్నీ చెల్లించాలని, లేనిపక్షంలో షాపులు సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు అప్పలరాజు, ఆర్ఐ వినోద్, కిరణ్, సాయిప్రసాద్, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ


పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ తవిటినాయుడు

భోగాపురం: మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్తహీనత బారిన పడకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఏసీడీపీఓ తవిటినాయుడు, సూపర్‌వైజర్ నాగమణి సూచించారు. మండలంలోని రామచంద్రపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకుని రక్తహీనత, ఇమ్యునైజేషన్, అనుబంధ పోషకారంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సమతుల్యత ఆహారంపై అవగాహన కల్పిస్తూ పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐరన్ సాంద్రత ఎక్కువగా ఉన్న కూరగాయలు, ఆకుకూరలు, జొన్నలు, గుడ్లు, మాంసాహార పదార్థాలు, బెల్లం, ఖర్జూరం వంటివి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం


వినాయక నిమజ్జనంలో భాగంగా కళాకారుల నృత్యం

భోగాపురం: వినాయక నిమజ్జనోత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఉంచి మేళతాళాలు, యువత నృత్యాల మధ్య నిమజ్జనం చేశారు. సవరవిల్లి పంచాయతీ మధుర గ్రామాల్లో నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి


భవనం నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న వలిరెడ్డి శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: విశ్వనాథపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి, పూర్తి చేయాల ని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని బుధవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి పాఠశాల భవన నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. అయితే కాంట్రాక్టరు పనులు ప్రారంభించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, నాలుగు నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రేవల్ల సత్తిబాబు, ప్రభాత్, తిరుపతి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే లలితకుమారి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మండల వ్యవసాయ అధికారి మాధురీ శరణ్యను ఆదేశించా రు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. శాఖల వారీగా మండల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించా రు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకంలో నిలిచి పోయిన పనులను పునరుద్ధరిస్తామని, ప్రతీ ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు నిధులు మంజూరయ్యాయని, పనులకు సంబంధించి అంచనాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఖరీఫ్ వరి నాట్లు వేయని రైతులను గుర్తించి, వారికి ప్రత్యామ్నాయ పంటలు సాగుపై అవగాహన కల్పించాలని ఏఓకు సూచించారు. కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పాత ఎంపీడీఓ కార్యాలయం వరకు రోడ్డు పూర్తిగా పాడయ్యిందని, ఈరోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే గ్రామాల్లో శిథిలమైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వేయాలని కోరారు. వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, ఎంపీడీఓ వై.పద్మజ, తహసీల్దార్ బి.నీలకంఠరావు, ఈఓపీఆర్డీ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

